క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: గుండివాగు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని గుండివాగు సర్పంచ్ గౌలె దత్తురాం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. గతకొన్నేళ్ల నుంచి గుండివాగుకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో కిరవలే గణపతి, బిసే పర్శురాం, శేక్‌హసన్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఇచ్చోడ, మన్నూర్ సీసీఐ కేంద్రాల్లో సోమ, మంగళవారం రెండు రోజులు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రమేశ్ తెలిపారు. పత్తి నిల్వలు పేరుకుపోయినందున కొనుగోళ్లను నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు. పత్తి రైతులు గమనించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఇచ్చోడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం నిర్వహించే సమావేశానికి తగినంత కోరం లేనందున వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తర్వలో సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

తుల అరుణను కలిసిన నాయకులు

బోథ్: ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ కోఆర్డినేటర్‌గా నియమితులైన తుల అరుణ్ కుమార్‌ను మండల కేంద్రానికి చెందిన నాయకులు మల్లెపూల విజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. బోథ్ మండలానికి చెందిన అరుణ్ ఉన్నత పదవిలో కొనసాగడంపై హర్షం వ్యక్తం చేశారు.

సభ్యులంతా ఐక్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న పుసాం ఆనంద్‌రావు

బేల: పర్ధాన్ సంఘం సభ్యులంతా ఐక్యంగా పని చేయాలని సంఘం జిల్లా నాయకులు పుసాం ఆనంద్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత మండల కమిటీ ని రద్దు చేయాలన్నారు. త్వరలోనే హిరసుక్కా జయంతి, మండల సభ్యులకు డివిజన్, జిల్లా కమిటీ చోటు కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గేడం మాధవ్, తానాజీ, నైతం సీతరాం, పుసాం ప్రభాకర్, ఉర్వతే కిశోర్, నైతం పురుషోత్తం, గోడం సునీల్, సచిన్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


ట్రోఫీ అందజేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిలు అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం చాందా(టి) సమీపంలోని మైదానంలో డెంటల్ ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఆదిలాబాద్ ఐడీఏ వర్సెస్– జగిత్యాల ఐడీఏ జట్లు హోరాహోరీగా తలపడగా ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జగదీష్ రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, గడ్డం పోతారెడ్డి, పూసాయి సర్పంచ్ అల్లూరి పోతారెడ్డి, కృష్ణారెడ్డి, చింతలపెల్లి లింగారెడ్డి, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం 146వ వారానికి చేరింది. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రస్ట్ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సుధీర్ కుమార్, సంతోష్, సుధీర్, సలీమ్, శుభాష్, అంబయ్య, రాజయ్య పాల్గొన్నారు.

నిలిచిన వంతెన పనులు


వాగులో నుంచి వెళ్తున్న వాహనదారులు

- ఐదు నెలలుగా ముందుకు సాగని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బేల: మండలంలోని దుబ్బగూడ(ఎస్) గ్రామ శివారులోని వాగుపై రూ.3కోట్ల వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ పనులు గత మేలో ప్రారంభమై జూలై వరకు కొనసాగాయి. ఆ తర్వాత గత ఐదే నెలలుగా పనులు ఎక్కడికక్కడే నిలిచి, ముందుకు సాగడం లేదు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. వంతెన ఎప్పుడు పూర్తవుతుందోనని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే చుట్టూ పక్కల అనుబంధ గ్రామాలకు రవాణా సౌకర్యం సుగుమం కానుంది. మండలంలోని ఏడు గ్రామాలకు సాత్నాల ప్రాజెక్టు (జైనథ్) పక్క నుంచి చుట్టూ తిరిగి వచ్చే తిప్పలు తప్పనున్నాయి. బేలకు నేరుగా రాకపోకలకు సాగించవచ్చు. అంతేకాకుండా ఆదిలాబాద్, ఇంద్రవెల్లి మండలాలకు చెందిన ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది.

నిలిచిన నిర్మాణ పనులు..

దుబ్బగూడ(ఎస్) శివారులోని పెద్ద వాగుపై వంతెన నిర్మాణం కోసం ఐదేళ్ల క్రితం ఐటీడీఏ ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.3కోట్లు మంజూరయ్యాయి. సాంకేతిక సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. చాలా ఆలస్యంగా గతేడాది నిధుల తాలుకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. గత మేలో అప్పటి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న వంతెన పనులకు భూమిపూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడు పిల్లర్ల గోడల పనులు పూర్తయ్యాయి. మరో మూడు పిల్లర్ల గోడలు ప్రారంభంలో ఉన్నాయి. ఇంకో మూడు పిల్లర్ల ప్రారంభించాల్సి ఉంది. ఇంకా ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. కానీ నిర్మాణ పనులు ఆగస్టు నుంచి ముందుకు సాగడం లేదు. పనులన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

తప్పని తిప్పలు..

మండలంలోని ఏడు గ్రామాల ప్రజలు బేలకు నేరుగా రాకపోకలు సాగించే వీలు లేదు. ఏళ్ల నుంచి దుబ్బగూడ(ఎస్), పాత టెంబ్రిగూడ, కొత్త టెంబ్రిగూడ, ఖార, వంజరిగూడ, షాజీతండా, గర్కగూడ ప్రజలు వివిధ పనుల కోసం 16 నుంచి 22 కిలోమీటర్ల వరకు చుట్టూ తిరిగి సైద్‌పూర్‌కు చేరుకుని, అక్కడి నుంచి బేలకు రాకపోకలు సాగిస్తున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక దూరభారంతో అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే 1.5 నుంచి 6 కిలోమీటర్లతో సైద్‌పూర్‌కు చేరుకుని, నేరుగా బేలకు రాకపోకలకు చాలా దూరభారం తగ్గనుంది.

పనులు నడుస్తలేవు



మా ఊరి నుంచి లోకారి, నార్నూర్, గాదిగూడ వైపుకు రాకపోకలు ఇక్కడి నుంచే సాగుతాయి. దుబ్బగూడ (ఎస్) గ్రామ శివారులోని వాగుపై వంతెన నిర్మాణ పనులు నాలుగైదు నెలల నుంచి నడుస్తలేవు. పనులు ఇంకెప్పుడు చేపడుతారో తెలియదు.

–జగన్, లోహర, ఆదిలాబాద్ రూరల్

వంతెన పూర్తి చేయాలి



దుబ్బగూడ(ఎస్) గ్రామ శివారులోని వాగుపై వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వర్షకాలంలో వాగు నుంచి రాకపోకలు బంద్ అవుతాయి. సాత్నాల వైపు నుంచి బేల మండల కేంద్రానికి రాకపోకలు సాగుతాయి. వంతెన పూర్తయితే దూరభారం తగ్గనుంది. వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

–లస్మ, టెంబ్రిగూడ, బేల

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: అఖిల గాండ్ల తేలికుల సంఘం ఆదిలాబాద్ జిల్లా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌లు హాజరై సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే నూతనంగా ఎన్నికైన నా కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాండ్ల కులస్తుల అభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, దుర్గం శేఖర్, గాండ్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అమనగంటి శ్రీనివాస్, బొల్లం వీర సుందరం, పిన్నాంవార్ రాజేష్, తమ్మల్లవార్ చందు, చిక్కాల దత్తు, విలాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని పర్ధాన్‌గూడ కాలనీవాసులు ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో బీఏడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

మండల కేంద్రానికి చెందిన హర్షిత, ఆరాధ్య చాలెంజ డాన్స్ అకాడమీలో శిక్షణ పొంది మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో జరిగే డాన్స్ కా దంగల్ సీజన్– 2లో ఎంపిక అయ్యారు. కాగా అక్కడ వెళ్లడానికి ఆర్థి క స్థోమత లేక పోవడంతో ఆ విద్యార్థులకు రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు.

యువత క్రీడా స్ఫూర్తి కొనసాగించాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ: యువత క్రీడాస్ఫూర్తి కొనసాగించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లమ్మగూడలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో సైతం క్రికెట్ పోటీలు నిర్వహించడంపై యువతను అభినందించారు. క్రీడల్లో రాణిస్తూనే ఉపాధి వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, కన్నమయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నేరడిగొండ: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్, సూర్యకాంత్, దేవేందర్, వినోద్, సంతోష్, వినోద్, ప్రవీణ్, లక్ష్మణ్ పట్టిపు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం కోసం ఆదివారం రూ.88 లక్షలతో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలిచిన ఒక్క నెలలోనే రూ.30 కోట్లతో బోథ్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు మొదలుపెట్టడం జరిగిందన్నారు. రోడ్డు, విద్య, వైద్యం అందించేందుకు ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు. పెద్ద బుగ్గారం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచల జాదవ్ రేణుకబాయి, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకట రమణ, ఏలేటి రవీందర్ రెడ్డి, అంబేకర్ పండరి, జాదవ్ కృష్ణనాయక్, జాదవ్ వసంత్‌రావు, రాథోడ్ సురేందర్, పాండు, జగన్, సుజీల్, రాథోడ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

తాంసి రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రజనీకాంత్


రజనీకాంత్ రెడ్డి

తాంసి: తాంసి రెడ్డి సంఘం అధ్యక్షుడిగా యెల్మ రజనీకాంత్ రెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రజనీకాంత్ రెడ్డి, కార్యదర్శగా మల్లిఖార్జున్ రెడ్డి, కోశాధికారి సురేందర్, ఉపాధ్యక్షుడిగా ఉమాకాంత్ రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు చిన్నరాంరెడ్డి,గోపిడి నారాయణ రెడ్డి, గోవర్ధన్, రాహుల్ పాల్గొన్నారు.

నేటి నుంచి అడానేశ్వర్ సప్తాహం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల సద్గురు అడానేశ్వర్ సేవాశ్రమంలో సద్గురు అడానేశ్వర్ మహా సమాధి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి అడానేశ్వర సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 15వరకు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు హారతి, గ్రంథ పారాయణం, స్తోత్ర పారాయణం, భజనలు, పల్లకి శోభాయాత్ర, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సద్గురు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

'భూ నిర్వాసితులకు అన్యాయం'


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కైలాస్‌నగర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభ నిబంధనలు సడలించడంతోనే రామాయి రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు బాలురి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. భూములను కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి గ్రామరైతులు ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు పట్టాలున్నప్పటికీ ధరణిలో వారి వివరాలు లేకపోవడంతో అన్యాయం జరుగుతుందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం రైతుల నుంచి 664 ఎకరాల 21 గుంటల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 80 శాతం రైతులు ఒప్పుకుంటునే భూమిని సేకరించాలనే నిబంధనను పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. భూములు ప్రభుత్వం కాకుండా ఫ్యాక్టరీ యజమాన్యమే కొనుగోలు చేస్తే రైతులకు లాభం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామన్నారు.

9న తుడుందెబ్బ కమిటీ ఎన్నిక

బోథ్: ఈనెల 9న మండల కేంద్రంలోని షాదీఖనాలో బోథ్ తుడుందెబ్బ మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్ తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి నాయకులు తరలిరావాలని కోరారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి


గంగాధర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంపై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కొండూరు గంగాధర్ మాట్లాడుతూ సంఘ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని, నిర్మాణం పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.

అద్దె భవనాల్లో గురుకులాలు


ఇచ్చోడలో అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల

- అరకొర వసతుల మధ్య చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

ఇచ్చోడ: మండలంలోని గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన వసతులు లేక పోవడంతో గురుకులాల్లో విద్యార్థుల విద్యాబోధన అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా మండలంలో పలు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతుండం విద్యార్థులకు శాపంగా మారింది.

ఏళ్లుగా అద్దె భవనాల్లోనే..

మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల, సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాల గత పదిహేను సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల తొమ్మిది సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది.

కనీస వసతులు కరువు..

గత కొనేళ్లుగా మండల కేంద్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న మూడు గురుకుల పాఠశాలలు అరకొర వసతులు మధ్య కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేక పోవడం, పూర్తిస్థాయిలో తరగతి గదులు, డార్మెంటరీలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆట స్థలాలు లేక పోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. వర్షాకాలంలో ఊరుస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

భవనాలు నిర్మించాలి



అద్దె గదుల్లో కొనసాగుతున్న పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అద్దె గదుల్లో పాఠశాలలు ఉండటంతో ప్రభుత్వంపై అద్దె భారం పడుతుంది.

– పెరమండ్ల స్వామి, యువజన సంఘం నాయకుడు

సౌకర్యాలు లేవు



మండల కేంద్రంలో అద్దె గదుల్లో కొనసాగుతున్న పాఠశాలలకు సరైన సౌకర్యాలు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం కనీస బాధ్యతగా గుర్తించాలి.

– ఫారుఖ్, మైనార్టీ యూత్ సభ్యులు

ప్రభుత్వ స్థలాలు కేటాయించాలి



మండల కేంద్రంలో అద్దె భవనల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

– నిమ్మల సంతోష్‌రెడ్డి, సామాజిక కార్యకర్త

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు


బోథ్: అక్షింతలు పంపిణీ వీహెచ్‌పీ నాయకులు


జైనథ్: శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్ కాలనీలో అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఇంటింటికీ కి రుగుతూ అక్షింతలు అందజేశారు. వార్డు కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, శ్రీరాముని దీవెనలు ప్రతిఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ డెవలప్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పుల దేవిదాస్, ఆజాడే ప్రేమ్‌సింగ్, చందా గణేష్, భోజా రెడ్డి, రమేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని నిరాల గ్రామంలో రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆదివారం అక్షింతలు, రాములోరి చిత్రపటాలతో శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బోథ్: అయోధ్య అక్షింతలను ఆదివారం వీహెచ్‌పీ నాయకులు మండల కేంద్రంలో గడప గడపకూ పంపిణీ చేశారు. గ్రామంలో మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి పాలిక్ రమేశ్, శ్రీనివాస్, అనిల్ కుమార్, కట్కురి సాయి, కూన రాము, సతీష్, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మంలడంలోని ముఖరా(బి)లో ఆదివారం సర్పంచ్ అడమ్‌మారుతి ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. హన్‌మాన్ ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధులు గుండా ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి కేంద్రం శ్రీకారం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని ఉపశ్నాల గ్రామంలో ఐటీడీఏ పరిధిలో కేంద్రం మంజూరు చేసిన నిధులతో ఆదివాసీ నిరుపేదలకు నిర్మించనున్న పది ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలుకాలేదని ఆరోపించారు. ప్రతిసమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. పనులు నాణ్యతగా చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బోయర్ విజయ్, రామెల్లి మోరేశ్వర్, బోనిగిరివార్ గణేష్, బోడకుంటి రాకేష్, ఠాక్రే సందీప్, కదరపు ప్రవీణ్, కొడే ప్రదీప్, ధర్నే జీవన్, బర్కాడే రాము, పోత్రాజ్ నవీన్ , తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

మండలంలో పర్యటనకు వచ్చిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ఆదివాసీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొరంగే జంగ్‌షా, ఆడ శంకర్, ఎంపీటీసీ మడావి సకారం, నైతం సీతరాం, కొడప భీంరావు, మెస్రం బాజీరావు, తదితరులు పాల్గొన్నారు.